కొత్త సంవత్సరంలో ఆనందం నిండాలి


హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నానని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, పార్టీ ప్రజాప్రతినిధులకు ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో మంచి ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రానున్న రోజుల్లో అన్ని వర్గాలకు మరింత మేలు చేకూరుతుందన్నారు.

60 మందికి గుండె వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: దమ్మెన్ను గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విజయవాడ డాక్టర్ వైవీ రావు ఉషా కార్డియాక్ సెంటర్ నుంచి వచ్చిన వైద్యులు సుమారు 60 మందికి గుండె స్కానింగ్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. వారిలో 7 మందికి ఆపరేషన్లు నిమిత్తం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉషా కార్డియాక్ సిబ్బంది పాల్గొన్నారు.

సైసై జోడెడ్లా బండి

- రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు
- సందడిగా రంగంపేట మండల పరిసరాలు


ఎడ్ల బండ్ల పరుగు పోటీల్లో సీనియర్స్ విభాగంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రాజా


పోటీల్లో జోరుగా పరుగెడుతున్న ఎడ్లు

రంగంపేట: జోడెడ్ల బండ్లు సైసై అంటూ ముందుకు కదిలాయి.. నువ్వా నేనా అనేట్టు పరుగెత్తాయి.. రంగంపేట మండలం వడిశలేరు గ్రామ సమీపంలోని గన్ని వ్యవసాయ క్షేత్రం వద్ద ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల బండ్ల పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఇందులో విజేతలకు రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దివంగత ఆదర్శ రైతు గన్ని సత్యనారాయణ మూర్తి స్మారకార్థం ఆయన కుమారుడు, రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారంతో కూటి కోటేశ్వరరావు, బొప్పన బ్రహ్మాజీరావుల నిర్వహణలో ఈ పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 71 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొనగా, సీనియర్స్ విభాగంలో 1,600 మీటర్లలో 14 జతలు, జూనియర్స్ విభాగంలో వెయ్యి మీటర్లలో 57 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలతో వడిశలేరు నుంచి రంగంపేట వరకూ ఏడీబీ రోడ్డు జన సందోహంగా మారింది. గట్టి పోలీసు బందోబస్తు నడుమ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోటీలు ప్రశాంతంగా పోటీలు నిర్వహించారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, షర్మిలారెడ్డి, జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ పోటీలను తిలకించారు.

సంప్రదాయాలను పరిరక్షిద్దాం..

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. పాశ్చాత్య సంస్కృతి ముసుగులో యువత తప్పటడుగులు వేస్తున్న ప్రస్తుత కాలంలో మన గత వైభవానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఎడ్లను తీసుకురావడం అభినందనీయమన్నారు. ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ప్రత్యేక స్థానం

గోదావరి జిల్లాలో ఎడ్ల బండ్ల పరుగు పోటీలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యంగా సంక్రాంతికి సంప్రదాయంగా ఈ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. వీటి నిర్వహణకు జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సహకారం అందించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా గోదావరి జిల్లా వాసులకు జీఎస్ఎల్ వైద్యులు అందిస్తున్న వైద్య సేవలు ఎనలేనివన్నారు. జిల్లాను క్యాన్సర్ రహితంగా చేసేందుకు వారి కృషి ప్రశంసనీయమన్నారు.

రైతులను ప్రోత్సహించడానికే..

అంతరించిపోతున్న ఎడ్ల పందేల సంస్కృతిని కాపాడడంలో భాగంగా రైతులకు పోటీల ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నారని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. విజేతలకు లక్షలాది రూపాయలు బహుమతిగా అందిస్తున్నారని, అదేవిధంగా పోటీలకు వేలాది మంది ప్రజలు విచ్చేయడం బాగుందన్నారు. గన్ని సత్యనారాయణమూర్తి స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించారన్నారు. భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఎడ్ల బండ్ల పోటీలు మరిన్ని నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పోటీలు తిలకించడానికి విచ్చేసిన ఎంపీ మార్గాని భరత్ రామ్, ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను జీఎస్ఎల్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సత్కరించారు. ఎడ్ల బండ్ల ప్రతిమలను బహూకరించారు.

విజేతలు వీరే...

సీనియర్స్ విభాగంలో 14 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతిని గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి ఎడ్లు గెలుచుకున్నాయి. ద్వితీయ బహుమతిని గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు, గుమ్మిలేరుకు చెందిన కోరా శృతిచౌదరి, తృతీయ బహుమతిని నరసయ్యపేటకు చెందిన ముమ్మిన శివతేజ ఎడ్లు సాధించాయి. జూనియర్స్ విభాగంలో 57 జతల ఎడ్లు పాల్గొనగా మొదటి బహుమతి మండపేటకు చెందిన వేగుళ్ల రామస్వామి, ద్వితీయ బహుమతి కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ, తృతీయ బహుమతి వన్నెపూడికి చెందిన బవిరిశెట్టి మణి ఎడ్లు గెలుచుకున్నారు. సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, ద్వితీయ, తృతీయ, అలాగే జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఎలక్ట్రికల్ బైక్‌లు, సీనియర్స్ విభాగంలో మరో ఐదుగురికి, జూనియర్స్ విభాగంలో మరో 5 మందికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. విజేతలకు ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

జిల్లాలో కొవ్వూరు సబ్ డివిజన్‌కు ఉత్తమ అవార్డు

- ఈ ఏడాది 17 గాను తొమ్మిది అంశాల్లో ప్రథమ స్థానం
- పోలీసుశాఖ విధి నిర్వహణలో కొవ్వూరుకే ఓవరాల్ ప్రతిభ అవార్డు


కొవ్వూరు పోలీసు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, సీఐలు

కొవ్వూరు: జిల్లాలో 2023లో కొవ్వూరు సబ్ డివిజన్ పోలీసుశాఖ విధి నిర్వహణలో తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులను దక్కించుకున్నట్టు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖపరమైన విధుల నిర్వహణలో 17 అంశాల్లో ఓవరాల్ ప్రతిభలో ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందన్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఇళ్లు విడిచి ఊళ్లు వెళ్లే వారు ఎల్‌హెచ్ఎం స్కీంను వినియోగించుకుని సీసీ కెమేరాలు అమర్చుకోవడం ద్వారా చోరీలకు ఆస్కారం ఉండదన్నారు. ఇళ్లు వదిలి వెళ్లే సమయంలో కచ్చితంగా ముందు ఉండే మెయిన్ గేటుకి తాళాలు వేయవద్దని సూచించారు. తాళం వేయడం మూలంగా దొంగలు చోరీకి ఎంచుకోవడం సులభమవుతుందన్నారు. డివిజన్‌లో ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ లో సిబ్బంది సమష్టి కృషి ఫలితంగా ఈ అవార్డులు సాధించగలిగామన్నారు. బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఇన్ నాన్ గ్రేవ్ క్రైం(అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల సంఖ్య తగ్గించడంలో బెస్ట్ డివిజన్ అవార్డు అందుకున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గత ఏడాది కంటే తగ్గించడంలోను, ముందుస్తు నివారణ చర్యలు తీసుకోవడంలోను ప్రథమ స్థానం సాధించామన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన నిందితులను సకాలంలో పట్టుకోవడం, సొసొత్తు రికవరీ చేయడంలోను ప్రతిభ కనబరిచినందుకు సబ్ డివిజన్‌కి ప్రథమ స్థానం సాధించినందుకు మరో అవార్డు లభించిందన్నారు. బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఇన్ విజిబుల్ పోలీసింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నియంత్రణ, పేకాట, కోడి పందెలు నియంత్రణలో భాగంగా అధిక కేసులు నమోదు చేయడంలోను ప్రతిభ చూపినందుకు డీఎస్పీతో పాటు గోపాలపురం ఎస్‌హెచ్‌వో కర్రి సతీష్‌లకు జిల్లా ఉత్తమ అవార్డు దక్కించుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఉత్తమ ప్రతిభా ఇన్ మిక్సింగ్ పర్సన్స్ కేసులు సకాలంలో ఛేధించినందుకు గాను నిడదవోలు ఎస్సై పి.నాగరాజుకి ఉత్తమ అవార్డు దక్కిందన్నారు. స్పందన ఫిర్యాదులు, జగనన్నకి చెబుదాం వినతులు పరిష్కారంలో తాళ్లపూడి ఎస్సై కేవీ రమణ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా అవార్డు దక్కించుకున్నట్టు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిల్‌బుల్ వారెంట్స్ అమలు చేయడంలో కొవ్వూరు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాశరావు, పెరవలి హెచ్‌సీ కె.శ్రీహరి, నిడదవోలులో ఏఎస్సై డి.కోటేశ్వరరావులు ఉత్తమ అవార్డులు దక్కించుకున్నారన్నారు. ప్రాణప్రాయ స్థితిలో ఉన్న వారి రక్షించడంలో తేనెటీగల నుంచి పిల్లలను రక్షించి విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావుకి ఉత్తమ అవార్డు దక్కించుకున్నా రని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేయడంలో నిడదవోలు ఎస్సై పి.నాగరాజు 95 కేసులు నమోదు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. శాంతి భద్రతలు పరిరక్షణలో విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించడంలో నైపుణ్యత ప్రదర్శించిన దేవరపల్లి ఎస్సై కర్రి శ్రీహరిరావుకి జిల్లా ఉత్తమ అవార్డు ని దక్కించుకున్నారని తెలిపారు. రాత్రి పూట గస్తీల నిర్వహణలో ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని విధి నిర్వహణలో ప్రతిభ చూపిన దేవరపల్లి కానిస్టేబుల్ ఎస్కే సలీం, హోమ్ గార్డు పి.అనిల్‌కుమార్‌లకు ఉత్తమ అవార్డులు దక్కించుకున్నారని తెలిపారు. సీఐలు వి.జగదీశ్వరరావు, వైవీ రమణ, ఎ.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, నున్న రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ : వ్యక్తి మృతి


మృతుడు దేశాబత్తుల రమణ (50)

తాళ్లపూడి: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మధ్యలోకి వెళ్లి ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం మలకపల్లిలో చోటుచేసుకుంది. తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ కథనం ప్రకారం.. మలకపల్లి లూథరన్ చర్చిలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మధ్యలో పలువురు విడదీయడానికి వెళ్లి ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో దేశాబత్తుల రమణ (50) ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందినట్లు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

కొవ్వూరు: ఔరంగబాద్ శివారులో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మట్టా దేముడు (59) ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో డ్యూటీకి వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో మసీదు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతను సమీపంలో పొదల్లో పడిపోయాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న దేముడు కుమారుడు ఆనందరావు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై జీవీవీ సత్యనారాయణ తెలిపారు.













కొత్త సంవత్సరానికి స్వాగతం

- వాడవాడలా న్యూ ఇయర్ వేడుకలు
- ఉల్లాసంగా గడిపిన యువత

కొవ్వూరు/ చాగల్లు: అంతా మంచే జరగాలని కోరుకుంటూ కోటి ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు అందరూ సిద్ధమయ్యారు. వాడవాడలా న్యూ ఇయర్ వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి ప్రతి ఇంటి ముందు రంగవల్లులు వేసి నూ ఇయర్‌కు ఆత్మీయ స్వాగతం పలకనున్నారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఆలయాల్లో పూజలు, చర్చిలు, మసీదుల్లో ప్రార్థనలు చేయనున్నారు. మండలంలో పలుచోట్ల ఫుడ్ ఆఫర్లను పెడుతూ బిర్యానీ సెంటర్లు వెలిశాయి. జనాన్ని ఆకట్టుకునేందుకు హోటళ్ల నిర్వాహకులు వివిధ రకాల మాంసాహార వంటకాలను తయారు చేశారు. పండ్లు, పూలు, మద్యం, మాంసం, చేపలు, కేక్‌లు, బొకేల అమ్మకాలకు భారీగా గిరాకీ పెరిగింది. నూతన సంవత్సరం శుభాకాంక్షలను తెలుపుతూ పలువురు రాజకీయ పార్టీల నాయకులతో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం తెలుపుతూ మహిళలు ఇళ్ల ముందు రకరకాల రంగవల్లులు పెట్టారు. యువకులు ఒకరికొకరు కేరింతలు కొడుతూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ సంబరాలు చేసుకున్నారు.



చాగల్లులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేకులు



తాళ్లపూడిలో రంగుల విక్రయం

తాళ్లపూడి: మండల ప్రజలు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్‌లో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకొంటున్నారు. తాళ్లపూడి మార్కెట్‌లో బేకరీలు, పూలు, పండ్ల దుకాణాలు, రంగులు, వస్త్ర దుకాణాలు జనంతో కళకళలాడాయి. గడచిన సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ మహిళలు ఇళ్ల వద్ద అందంగా ముగ్గులు వేశారు. మండలంలో ఎక్కడికక్కడే బిర్యానీ సెంటర్లు వెలిశాయి. మార్కెట్లో వివిధ రకాల పూల బొకేలను విక్రయిస్తున్నారు. బేకరీల్లో వివిధ రకాల ఆకారాలు, రంగుల్లో, సైజుల్లో కేక్‌లను విక్రయించారు.

నల్లజర్ల: చిన్నా పెద్దాల సంబరాలు, యువత కేరింతల నడుమ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. 2023కు వీడ్కోలు చెప్పి 2024కు స్వాగతం పలికారు. పలుచోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలతో నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. దేవాలయాలు, ప్రార్థన మందిరాలలో ఆదివారం అర్ధరాత్రి వరకూ ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ నున్న రాజు ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. బేకరీలు, స్వీట్ షాపులు, బిర్యానీ పాయింట్లు, రంగుల దుకాణాలు కిటకిటలాడాయి.



కొవ్వూరులో పోతురాజు దిబ్బ ప్రాంతంలో అందంగా తీర్చిదిద్దిన రంగవల్లి



కొవ్వూరు బాపూజీనగర్‌లో సామాజిక మాధ్యమా లోగోలతో వేసిన ముగ్గు

వైఎస్సార్ సీపీ నిడదవోలు మండల అధ్యక్షుడిగా పల్లారావు



నిడదవోలు రూరల్: వైఎస్సార్ సీపీ నిడదవోలు మండల నూతన కమిటీని 27 మందితో నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన పల్లారావు ఎంపికయ్యారు. పల్లారావు 2015 నుంచి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు. ఉపాధ్యక్షులుగా ఆరేపల్లి చంటి, రాపాక వెంకట్రావు, ప్రధాన కార్యదర్శులుగా వెలగన పోలయ్య, అనంతపల్లి కృష్ణచైతన్య, ముదునూని జగదీష్‌వర్మ, కోశాధికారిగా మద్దాల సుబ్బారావు, కార్యదర్శులుగా రేలంగి మారుతి, ఎస్.వీర్రాజు, కాల్దారి శ్రీను, బట్టు సురేష్, తాతపూడి నాగేశ్వరరావుతో పాటు మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

రవికుమార్‌కు ఉత్తమ వాసవీ అవార్డు

నిడదవోలు: సామాజిక సేవలను గుర్తిస్తూ నిడదవోలు పట్టణానికి చెందిన వాసవీ వైస్ గవర్నర్ కేదారిశెట్టి రవికుమార్‌కు వాసవీ ఉత్తమ వైస్ గవర్నర్ అవార్డు దక్కింది. విజయవాడలోని 30వ తేదీన రాత్రి జరిగిన 2023 వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ విజయభేరి అవార్డుల ప్రదానోత్సవంలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు.



గాయత్రి చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న రవికుమార్

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. 2023 ఏడాది ముగింపు సందర్భంగా ఎక్కువ మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.81,253 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది ఆలయంలో సేవలందించారు.





మంచినీటి సరఫరాలో అంతరాయం

నిడదవోలు : పట్టణంలోని నెహ్రూనగర్‌లో ఉన్న మంచినీటి రిజర్వాయర్ చెందిన కొత్త పైపులైన్ ఏర్పాటుకు చేయాల్సిన పనుల కారణంగా రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నెహ్రూనగర్ నుంచి గణపతి సెంటర్ వరకూ కొత్త పైపులైన్ పనులను చేపట్టామన్నారు. దీనివల్ల నెహ్రూనగర్ మంచినీటి ట్యాంక్, బాలాజీనగర్ ట్యాంక్ పరిధిలో 1వ వార్డు నుంచి 11వ వార్డు వరకూ, 13వ వార్డు నుంచి 16వ వార్డు వరకూ, 21, 22, 24వ వార్డు నుంచి 28వ వార్డులకు మంచినీటి సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఆమె తెలిపారు. ఈ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తామన్నారు.


190 మందికి కొత్త పింఛన్లు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా 190 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ పి.శామ్యూల్ ఆదివారం తెలిపారు. అట్లపాడులో 3, డి.ముప్పవరంలో ఒకటి, గోపవరంలో ఏడు, కంసాలిపాలెంలో ఆరు, కాటకోటేశ్వరంలో 13, కోరుమామిడిలో 27, కోరుపల్లిలో ఆరు, మునిపల్లిలో 15, పందలపర్రులో 10, పెండ్యాలలో 8, పురుషోత్తపల్లిలో 13, రావిమెట్లలో 12, సమిశ్రగూడెంలో 18, సింగవరంలో నాలుగు, తాడిమళ్లలో 14, తాళ్లపాలెంలో 9, తిమ్మరాజుపాలెంలో 11, విజ్జేశ్వరంలో 13 పింఛన్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొనడం సమంజసం కాదు

తాళ్లపూడి: ప్రభుత్వం ద్వారా, పార్టీలో పదవులను పొందిన వారే పార్టీని తప్పుపడుతూ కార్యక్రమాలు చేపట్టడం సమంజసం కాదని వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవ నారాయణ వారి తీరును ఖండించారు. ఆదివారం ఆయన మలకపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల మంచి కోసం ప్రభుత్వం అమలు చేసిన భూ హక్కు చట్టం 2022ను తప్పు పడుతూ ఇటీవల మలకపల్లిలో జరిగిన న్యాయవాదుల అవగాహన కార్యక్రమంలో కొంతమంది నాయకుల వ్యవహరించిన తీరును ఆయన విమర్శించారు. అధికార పార్టీ వారిగా సమాజంలో తిరుగుతూ, పార్టీ ద్వారా పదవులు అనుభవించిన వారు పార్టీకి అండగా ఉండాలి గానీ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను విమర్శించడం సబబు కాదని అన్నారు. టీడీపీ వారితో కలిసి న్యాయవాదుల సమావేశంలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: నూతన సంవత్సర క్యాలండర్‌ను స్థానిక లిబర్టీ కాంప్లెక్స్‌లో మానవత సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. నెలవారీ సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు అధ్యక్షతన జరిగింది. నూతన సంవత్సరంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సభ్యులు సూచించారు. కార్యక్రమంలో భోగవల్లి వెంకటసుబ్బారావు, ఉప్పాడకామేశ్వరావు, నందం రాజేంద్రప్రసాద్, దావులూరి చిరంజీవి, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, అల్లాడ రామకృష్ణ,పాతూరి సత్యనారాయణ, ఐవీసత్యం,చిటికిన రామారావు తదితరులు పాల్గొన్నారు.











